క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

సింగరాయకొండ: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముద్దాయిని అరెస్టు చేసిన సంఘటన ఆదివారం మండలంలోని పాకల గ్రామంలో జరిగింది. పాకల గ్రామానికి చెందిన కందుకూరి సుబ్బారావు వద్ద 8 మద్యం బాటిల్స్ స్వాధీన చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై బి. మహేంద్ర వివరించారు.

గ్రంథాలయంలో 1800 పుస్తకాలు


టంగుటూరులో చదవటం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు


టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో 1800 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గుమ్మడి వర్ధనరాజు అన్నారు. ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు.

కనుల పండువగా కోటి దీపోత్సవం


కోటి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

టంగుటూరు: మండలం లోని జమ్ములపాలెం శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గ్రామ భక్తులు కోటి దీపోత్సవం వేడుక ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి కోటి దీపాలను వెలిగించారు.

నేడు రామలింగేశ్వర స్పర్శ దర్శన ప్రాప్తి


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

కొండపి: మండలంలోని పెదకళ్ళగుంట గ్రామంలో వెలసియున్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో చివరి సోమవారం కావున తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు రామ్మూర్తి శర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అభిషేకాలు, సహస్ర దీప అలంకరణ, 21 కలిశం రుద్రాభిషేకం కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


లింగయ్య

మద్దిపాడు: స్థానిక యూటీఎఫ్ ఆఫీసులో ఆదివారం మండల శాఖ ఎన్నిక జరిగింది. యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా చిట్టెం లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా చేతల కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా రమేష్ బాబు, సహాధ్యక్షుడుగా ఆంజనేయులు, కోశాధికారిగా భాస్కర రావు, కుటుంబ సంక్షేమ కార్యదర్శిగా గురవయ్య , జిల్లా కౌన్సిలర్‌గా శ్రీనివాస రావు, తేజోవతి , ప్రసాదరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బాల వెంకటేశ్వర్లు, అబ్దుల్ హై, బుజ్జి బాబు రమణా రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆశ లత, సత్యవతి, మురళి, మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి


రామారావు (ఫైల్)

మద్దిపూడి: స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి రామారావు 64 ఆదివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మద్దిపూడి మండలం వేమవరం గ్రామానికి చెందిన జాగర్లమూడి రామారావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో ఒంగోలు వైద్యశాల తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రామారావు గతంలో మద్దిపూడి సొసైటీ మాజీ అధ్యక్షునిగా పనిచేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'భవిత'కు లేదు భరోసా!


చిన్నారులకు ఫిజియో థెరిపీ క్యాంప్


ప్రత్యేక అవసరాలు కల్గిన చిన్నారులు, తల్లిదండ్రులు

- ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు భరోసా ఇవ్వని భవిత కేంద్రాలు
- ప్రత్యేక శిబిరాల్లో పాల్గొన్న వారికి అందని పరికరాలు
- యంత్ర పరికరాల కోసం చిన్నారుల ఎదురు చూపు

కనిగిరి రూరల్:

మానసికంగా, శారీకంగా అవస్థలు పడుతున్న చిన్నారులకు వారి తల్లిదండ్రులకు మేమున్నామంటూ భవిత కేంద్రాలు మనోధైర్యాన్ని నింపాలి. కానీ నేటి ప్రభుత్వంలో వీరి ఆలనా పాలనా గుర్తుంచేవారు కనిపించడంలేదు. ఇటీవల ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వివిధ రకాల యంత్ర పరికరాలకోసం మార్కాపురం, ఒంగోలు, చీరాల ఏరియాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. ఆయా క్యాంప్‌లకు సుమారు 1000 మందికి పైగా హాజరయ్యారు. అందులో అర్హత పొందిన వారికి నేటికీ వినికిడి యంత్రాలు, వీల్స్ చైర్స్, ట్రై సైకిల్, చంక కర్రలు తదితర పరికరాలు అందించలేదు. తల్లి దండ్రుల అలెవెన్స్‌లు కూడా రాలేదు. నిధులు విడుదల అయ్యాయని, త్వరలో జమ అవుతాయని జిల్లా కోఆర్డినేటర్ రమేష్ చెప్తున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో భవిత కేంద్రాలున్నాయి. కనిగిరి, పామూరు, మండలాల్లో భవిత కేంద్రాల భవనాలున్నాయి. నూతన విద్యా పాలసీ ప్రకారం ప్రస్తుతం పాఠశాల భవనాలనే భవిత కేంద్రాలుగా మార్చి అన్ని మండలాల్లో విద్యా, శిక్షణలు ఇవ్వాల్సి ఉంటుంది. కనిగిరి నియోజకవర్గంలో 1–18 ఏళ్ల కల్గిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సుమారు గా 1,000 మంది వరకు ఉన్నారు. అందులో మండలంలోని సుమారు 215 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులున్నారు. వారు వివిధ సమీప పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వారిలో వివిధ గ్రామాల నుంచి 24 మంది వచ్చి కనిగిరి భవిత కేంద్రంలో శిక్షణ పొందాలి. భవితలో ప్రతి సోమవారం ఫిజియో థెరిపి క్యాంప్ నిర్వహించి, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నా పరికరాలు అందకపోవడంతో శ్రమ వృథా అవుతోంది.

సమస్య ముందుగా గుర్తిస్తే మేలు



సమస్య ఉన్న పిల్లలను త్వరగా గుర్తించి శిక్షణ ఇప్పించాలి. తల్లి దండ్రులు తరచూ భవిత కేంద్రాలకు వచ్చిన తాము ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరించాలి. నేను, నా స్నేహితులతో కలిపి సొంత నిధులతో వీల్ చైర్స్ అందజేశాం. మేము నేర్పిన అంశాలు, శిక్షణను తల్లి దండ్రులు క్రమం తప్పకుండా ఇంటి వద్దే నేర్పిస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. అప్పుడే పిల్లలు త్వరగా మెరుగు అవుతారు.

– మాచర్ల సైమన్ ఐఈఆర్పీ (కనిగిరి)

ఈ స్తంభం ఖరీదెంత?


అడితి రోడ్డులో విద్యుత్ స్తంభం విరిగిన దృశ్యం

సింగరాయకొండ: విద్యుత్ శాఖ లీలలు ఎవరికీ అర్థం కావడంలేదు. ఓ ప్రమాదంలో విరిగిన విద్యుత్ స్తంభానికి ప్రైవేటుగా జరిమానా విధించి జేబుల్లోకి వేసుకున్నారన్న వార్త హల్‌చల్ చేస్తోంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు కూడా నమోదు చేయకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. స్థానిక నరశింహా శ్రేష్టి అడితి రోడ్డులో శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో బియ్యం లారీ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా విద్యుత్ స్తంభం విరగడంతో అది రోడ్డు మధ్యలో వాలింది. ఆ సమయంలో ఆరోడ్డులో ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించలేదని స్థానికులు ఆరోపించారు. చివరకు ఆ శాఖ ఏడీఈ యుగంధర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఆయన వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. లారీ డ్రైవర్ వద్ద నష్టపరిహారం వసూలు చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. తర్వాత కొత్త స్తంభం ఏర్పాటు చేసిన ఆ శాఖ ఇతర అధికారులు లారీ డ్రైవర్‌పై క్రిమినల్ కేసు బనాయించకుండా భారీ మొత్తంలో డబ్బు వసూలు చేశారనే ప్రచారం జోరుగా సాగింది. ఆ డబ్బు ప్రభుత్వానికి జమ అయిందా లేక జేబుల్లోకి వెళ్లిందా అనేది లోగుట్టు పెరుమాళ్లకెరుకలా మారింది. దీనిపై ఏఈ సాంబశివరావును వివరణ కోరగా డ్రైవర్ వద్ద రూ. 8000 తీసుకున్నామని.. అవి జేసీబీ ఇతర ఖర్చులకు వెచ్చించామని తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం ఏదైనా కొత్త స్తంభం ఏర్పాటు చేయాలంటే విద్యుత్ శాఖకు డీడీ చెల్లించాల్సి ఉంటుంది.

కనిగిరి దుర్గం చర్చిలో మళ్లీ వివాదం


చర్చిలో రెండు గ్రూపులు ఘర్షణ పడుతున్న దృశ్యం

కనిగిరి రూరల్: కొంత కాలంగా చర్చిలో రెండు గ్రూపుల మధ్య వివాదం రోజు రోజుకూ ముదురుతోంది. కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చిలో పాలక మండలి కమిటీ ఏర్పాటు విషయంలో రెండు గ్రూపుల మధ్య రగడ జరుగుతోంది. గత ఆదివారం నుంచి బహిర్గత మైన రెండు గ్రూపుల వివాదం.. ఈ ఆదివారం తీవ్ర రూపం దాల్చింది. కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనకు సిద్ధమవుతున్న తరుణంలో పాత పాస్టర్ (సీనియర్) రెవ ప్రభుమనోహర్ దాస్‌కు బదులు వేరే పాస్టర్‌ను తీసుకొని వచ్చి సందేశాన్ని ఇప్పించేందుకు ఒక గ్రూపు కమిటీ ఉపక్రమించింది. దీంతో మరో గ్రూపు కమిటీ దాన్ని అడ్డుకుంది. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పాత పాస్టర్‌ను ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. రెండు గ్రూపులు గొడవలకు దిగుతున్న తరుణంలో విషయం తెలుసుకున్న సీఐ ఖాజావలి, ఎస్సై టి. శ్రీరాం పోలీస్ సిబ్బందితో వచ్చి రెండు గ్రూపులను చెదరగొట్టారు. ప్రార్థన చేసుకుని బయటకు వెళ్లాలని పోలీసులు సూచించారు. అందరినీ బయటకు పంపించి గేటు తాళం వేయించారు.

రెండు గ్రూపులతో చర్చలు..?

రెండు గ్రూపులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఇప్పటికే రెండు గ్రూపులకు చెందిన 10 మందిని బైండోవర్ చేసినట్లు తెలిసింది. వివాదాన్ని సామరస్యంగా, ప్రశాంతంగా పరిష్కరించేందుకు ఇరువురితో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

ఘనంగా కార్తీక వన మహోత్సవం


విశ్వ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు


కాపు వనభోత్సవాలు పాల్గొన్న కాపు, బలిజ


ఐక్యతా ప్రదర్శనలో కాపు నేతలు

కనిగిరి రూరల్: కార్తీక మాసం సందర్భంగా పట్టణంతో పాటు, వివిధ గ్రామాల్లో ఆలయాల వద్ద ఆదివారం కార్తీ మాస వనభోజనోత్సవ సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విజేతలకు బహుమతులు పంపిణీ తదితర కార్యక్రమాలు జరిగాయి.

విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక కంభం రోడ్డులో అర్బన్ కాలనీలో గల ఆవుల తిరుపతిరెడ్డి గెస్ట్ హౌస్‌లో విశ్వ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి.

కాపు సంఘం ఆధ్వర్యంలో..

మండలంలోని నందన మారెళ్ల గుడి వద్ద శ్రీ కృష్ణ దేవ రాయ కాపు, బలిజ కార్తీక వనభోజనోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రామయ్య నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కాపుల సంక్షేమ భవ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎమ్మెల్యే ఉగ్ర, మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను, డాక్టర్ రామయ్య నాయుడుని సన్మానించారు. శ్రావణి వెంకటేశ్వర్లు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పిడుగు బాబు రావు, కదిరి రమణయ్య, వాకా సత్యన్నారాయణ, బేతం శెట్టి జంగమయ్య నాయుడు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆర్యవైశ్య వన భోజనాలు

పామూరు: మండలంలోని ప్రముఖ క్షేత్రం అనుమునిగిరి శివరామ బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మండల ఆర్యవైశ్య వనభోజనాల కార్యక్రమం.. సంఘ నాయకులు యాదాల వెంకట సాయి కిరణ్, యేల్చూరి బాలకొండలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాసవీమాత, ఈశ్వరుడు, వెంకటేశ్వరుడు, ఉసిరిక చెట్టుకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం వాసవీమాతకు పల్లకిసేవ నిర్వహించి అఖండదీపం వెలిగించి పూజలు నిర్వహించారు. వనభోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మెంటా నరసింహారావు, సరాబు చంద్రమోహన్, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.


వనభోజనాల్లో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు


వనభోజనాల్లో వాసవీమాత చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


వనభోజనాల్లో అఖండ దీప పూజలు

వివాహ వేడుకల్లో దద్దాల


తాళ్లూరులో కోఆప్షన్ సభ్యుడు రహీం తమ్ముని కుమార్తె వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ, పార్టీ నేతలు


శంఖవరంలో పార్టీ యూత్ నాయకుడు నాగూర్ షరీఫ్ వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులకు చెందిన వేర్వేరు గ్రామాల్లోని రెండు వివాహ వేడుకల్లో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం పాల్గొన్నారు. పట్టణంలోని శంఖవరంలో ఎస్కే నన్నే సాహెబ్ (విజేత బ్రదర్స్) కుమారుడు ఎస్కే నాగూర్ షరీఫ్ (పార్టీ యూత్ నాయకుడు) వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వరుడికి షాదీ ముబారక్ తెలిపారు. అలాగే మండలంలోని తాళ్లూరులో కనిగిరి మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రహీం తమ్ముడు ఎస్కే ఖాజా రంతుల్లా కుమార్తె వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. నూతన వధూవరులు రిజ్వానా, సయ్యద్ ఖాజా రహంతుల్లాను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ), జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎస్. మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీలు జిలాని, ఫయాజ్, సర్పంచ్‌లు మూలే మాలకొండారెడ్డి, లోకిరెడ్డి అంకిరెడ్డి, ఎం. బ్రహ్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి. బొర్రారెడ్డి, ఎక్కంటి శ్రీనివాసులరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఎస్కే మీరావలి, డి. రవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైభవంగా మహా పుష్పయాగం


పుష్పాలతో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు యాగం చేస్తున్న వేద పండితులు


పుష్పయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహా రెడ్డి, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహా పుష్పయాగం అర్చకులు మంకాల శివప్రసాద్, పప్పు శ్రీకాంత్ వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి, శ్రీనారాయణస్వామి వార్లకు మహా పుష్పయాగం చేపట్టారు. ఆకాశదీపం కార్యక్రమం జరిగింది. ఆలయ పూజారులు మహా పుష్పయాగం చేపట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు, కొమ్మినేని వెంకటరావు, బయసాని మధుసూదన్, జిలకర నారాయణమూర్తి పాల్గొన్నారు.


పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

లక్ష్యంతో విద్యను అభ్యసించాలి


మాలపాడులో ప్రశంస పత్రం, జ్ఞాపిక అందిస్తున్న రామ్‌భూపాల్ రెడ్డి

పొన్నలూరు: ప్రతి విద్యార్థి పాఠశాల దశ నుంచే లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధాన మంత్రి అవార్డు గ్రహీత, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు రామ్ భూపాల్‌రెడ్డి అన్నారు. మాలపాడు కేజీబీవీ పాఠశాల్లో చదువుతూ గత విద్యా సంవత్సరంలో ఇంటర్, పది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు ప్రశంస పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఏకాగ్రత, పట్టుదలతో విలువలతో కూడిన విద్యను చదువుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు లోనుకాకుండా నిరంతర కృషితో ఉజ్వల భవిష్యత్‌ను పొందవచ్చన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది రామ్ భూపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయునులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


విద్యుత్ దీపాలంకరణలో కనిగిరి దుర్గం చర్చి


చాకిరాల వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్


కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

కనిగిరి రూరల్: సెమీ క్రిస్మస్ వేడుకలను నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గల చర్చిల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కేక్ కటింగ్ చేశారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు సందేశాన్నిచ్చారు. మండలంలోని చాకిరాల చర్చిలో పాస్టర్ ఎలీషా క్రీస్తు సందేశాన్ని ఇచ్చి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం పాల్గొన్నారు. అలాగే చాకిరాల, పట్టణంలోని కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి, పాతూరు చర్చిల వద్ద క్రిస్మస్ స్టార్‌లను, ట్రీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.


చాకిరాల చర్చి వద్ద సెమీ క్రిస్మస్ ప్రార్థనలు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం


అర్రిబోయిన రాంబాబును సత్కరిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అర్రిబోయిన రాంబాబుకు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పౌరసన్మానం జరిగింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్లసత్య.. రాంబాబు, సతీమణి శ్రీదేవిని గజమాలతో ఘనంగా సత్కరించారు. మంత్రిస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాంబాబును ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు, ఆవుల శ్రీనివాసులు, హెచ్‌ఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన


మహానివేదనతో ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న చైర్మన్, ఈఓ,


ఆలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహిస్తున్న యువత


నారాయణ స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


గోపూజలో పాల్గొన్న చైర్మన్, ఈఓ, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన కార్యక్రమం రుత్వికులు మంకాల శివ ప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోవుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి వారి మూల విగ్రహ మూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. భజంత్రీల మేళతాళాల నడుమ నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అదే విధంగా పూజా కార్యక్రమాల్లో రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పిడుగు బాబూరావు పాల్గొని పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.